క్లుప్తంగా

వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి



వధూవరులను ఆశీర్వదిస్తున్న శివప్రసాదరెడ్డి

దొనకొండ: మండలంలోని చందవరంలో ఎగ్గోని శ్రీనివాసరెడ్డి వివాహానికి, వద్దిపాడులో పాడతరపు చిన్న కాశయ్య వివాహానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, ఎగ్గోని క్రిష్టారెడ్డి, బండారు రాజు, డి.చెంచిరెడ్డి, పి.మూర్తయ్య పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

ముండ్లమూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నిరుద్యోగ యువతకు హౌస్ వైరింగ్‌లో వచ్చే నెల రెండో తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న నిరుద్యోగ యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ నెల రోజుల పాటు ఉంటుందన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని తెలిపారు. అర్హులైన యువకులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తో హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 95733 63141 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ పొంగళ్లు

ముండ్లమూరు: మండలంలోని రమణారెడ్డిపాలెంలో ఆదివారం పోలేరమ్మ పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో ఉదయం భక్తులు అమ్మవారికి 101 బిందెలతో అభిషేకం చేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ పూజారి రమేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గ్రామ ప్రధాన వీధుల్లో అమ్మవారి ఊరేగింపు కనులపండువగా సాగింది.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: ఒంగోలు బ్రాంచి కెనాల్‌లో పడి మృతి చెందిన కుటుంబాలను సీపీఎం నాయకులు తమ సంతాపం తెలియజేశారు. సాగర్ కెనాల్ వద్ద చంద్ కిరణ్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ కొత్తపల్లి, లక్ష్మీపురం, కొర్లమడుగు గ్రామాల్లో రైతు కుటుంబాలకు చెందిన ముగ్గురు స్నేహితులు లోకేష్‌రెడ్డి, చంద్‌కిరణ్ రెడ్డి, మణికంఠారెడ్డి మృతి చెందడం బాధాకరమన్నారు. రైతు సంఘనాయకులు ఈమని నాగేశ్వరరావు, కేవీ పిచ్చయ్య, యోహాను పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు అంకాళమ్మ దేవాలయం సమీపంలో రాధాకృష్ణ గీతాశ్రమంలో సోమవారం ఉదయం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆశ్రమం ప్రధాన కార్యకర్త శివసత్యానంద స్వామి ఆదివారం తెలిపారు. ఉదయం గం.9.15 ని నుంచి పూజలు, కేక్ కటింగ్, శ్రీ రాధాకృష్ణ కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వెలిగండ్ల మాజీ సర్పంచ్‌కి ఘన నివాళి

కొనకనమిట్ల: మండలంలోని వెలిగండ్ల మాజీ సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతకోట వెంకటకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆర్డీవో సరోజినీరెడ్డి భర్త మల్లికార్జునరెడ్డి, కుమార్తె డాక్టర్ శైలజ, కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మునగపాడు సర్పంచ్ పార్లపల్లి సిద్దానబీ, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రాణాలు కాపాడే మాకే భద్రత లేకపోతే ఎలా..

కోల్‌కతా ఘటన చాలా దురదృష్టకరం. ఆపద సమయాల్లో ప్రాణాలు కాపాడుతున్న మాకే భద్రత లేకుండా పోతోంది. వైద్యశాలల్లో రోజూ భయపడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. రాత్రి సమయాల్లో వచ్చే తాగుబోతులను అడ్డుకునే వారే ఉండటం లేదు. వైద్యులు, సిబ్బంది భద్రత కోసం ఆస్పత్రిలో కానిస్టేబుళ్లను 24 గంటలు బందోబస్తులో ఉంచాలి.

– వై.కోమలత, స్టాఫ్ నర్స్, సామాజిక ఆరోగ్య కేంద్రం, పెద్దదోర్నాల



వైద్యశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలి

వైద్యం కోసం రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వారి కుటుంబ సభ్యులతోపాటు ఇతరులు కూడా వైద్యశాలలో తిరుగుతుంటారు. ఏరియా వైద్యశాలకు రక్షణ గోడ లేకపోవడం వల్ల ఎవరు ఎటు పక్క నుంచి వస్తారో తెలియడం లేదు. రాత్రి వేళ డ్యూటీలో ఉండే మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణ లేకుండా పోతోంది. వైద్యశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి ప్రధాన గేటు వద్ద వాచ్‌మెన్లను నియమించాలి

– డాక్టర్ యదిద్యా, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, యర్రగొండపాలెం



గజానికో గొయ్యి

దట్టమైన నల్లమల అభయారణ్య ప్రాంతంలో ఉన్న ఆ జాతీయ రహదారి అడుగుకో గుంతతో ప్రయాణికులకు నరకం చూపుతోంది. వర్షం పడితే చాలు మోకాలి లోతు గుంతల్లో వాహనాల చక్రాలు ఇరుక్కుపోయి గంటల తరబడి ట్రాఫిక్ జాం అవుతోంది. కర్నూలు నుంచి పెద్దదోర్నాల వరకు రోడ్డు మార్గాన్ని 340 సీ జాతీయ రహదారిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఈ రహదారికి అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి.

- అధ్వానంగా నల్లమలలోని జాతీయ రహదారి
- వాహనదారులకు పరీక్ష
- చినుకు పడితే చాలు నరకప్రాయమైన ప్రయాణం



ఘాట్‌లో లారీ ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ అంతరాయంతో ప్రయాణికుల అవస్థలు

పెద్దదోర్నాల: నల్లమలలోని జాతీయ రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. మోకాళ్ల లోతుల్లో గుంతలు, కంకర తేలిన రోడ్లతో వాహనాదారులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ఇటీవల నల్లమలలో కురిసిన భారీ వర్షాలకు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. గుంతలు పడిన ప్రతీసారి వాటిని కంకర, మట్టిని పోసి సరిపెట్టడం మినహా శాశ్వత ప్రాతిపదికన రహదారులు నిర్మించటం లేదు. ఏళ్ల తరబడి ఈ రహదారులు ఇలాగే ఉండిపోతున్నాయి. ముఖ్యంగా రోళ్లపెంట, పెద్దమంతనాల మధ్య ముఖ్యమైన ప్రాంతాల్లో రహదారులపై పెద్ద పెద్ద గుంతలు వాహదారులకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో ఈ గతుకుల రహదారులపై వెళ్లే వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతుండగా, మరి కొన్ని వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

పెద్దమంతనాల నుంచి రోళ్లపెంట వరకు..

జిల్లాలోని సరిహద్దు ప్రాంతమైన పెద్దదోర్నాల మండల పరిధిలోని కర్నూలు జిల్లా సరిహద్దు ప్రాంతమైన రోళ్లపెంట వరకు రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. పెద్దదోర్నాల నుంచి నంద్యాల జిల్లా ఆత్మకూరు వరకు మొత్తం 60 కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. అందులో ప్రకాశం జిల్లాలోని రోళ్లపెంట వరకు జిల్లా పరిధి 30 కిలో మీటర్లు మాత్రమే. మన జిల్లా పరిధిలోని పెద్దమంతనాల నుంచి రోళ్లపెంట వరకు రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంటుంది. దట్టమైన అభయారణ్యం కావటంతో వర్షపాతం అధికంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో కొండలపై నుంచి జాలువారిన వర్షపు నీటి ప్రవాహం వల్ల రోడ్లు కోసుకుపోయి దారుణంగా మారాయి. దీంతో దోర్నాల నుంచి ఆత్మకూరు 60 కిలో మీటర్ల దూరం ప్రయాణించాలంటే గంటల కొద్దీ సమయం పడుతుండటంతో దూర ప్రాంతాలకు ప్రయాణించే వాహనాలు వాటి రూటు మార్చుకుని పెద్దారవీడు మండలంలోని కుంట, దేవరాజుగట్టు, గిద్దలూరు, నంద్యాల మీదుగా కర్నూలు చేరుకుని అక్కడి నుంచి దూర ప్రయాణాలు కొనసాగిస్తుంటాయి.



గంతల మయంగా కర్నూల్- గుంటూరు రహదారి

ఘాట్ రోడ్లలో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు: ఘాట్ రోడ్లు మరమ్మతులకు గురవడంతో పాటు, రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. దశాబ్దాల క్రితం నాటి రద్దీకి అనుగుణంగా నిర్మించిన ఇరుకు రోడ్లు, సామర్థ్యానికి మించిన అధిక లోడుతో వాహనాల ప్రయాణం, వాహనాల నిర్వహణలో యజమానుల నిర్లక్ష్యం, వాహనాల్లో తలెత్తే సాంకేతిక లోపాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇరుకైన రహదారుల్లో తలెత్తే ఇబ్బందుల వల్ల వాహనాలు రోడ్డుకు అడ్డుగా నిలబడటంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు, దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చే యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు నుంచి పెద్దదోర్నాల వరకు రోడ్డు మార్గాన్ని 340 సీ జాతీయ రహదారిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఈ రహదారికి అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి. దీనికి సంబంధించి అటవీ ప్రాంతంలో సర్వే జరుగుతోంది. అది పూర్తయితే మరి కొద్ది రోజుల్లో పర్యావరణ శాఖ, అటవీశాఖ అనుమతులు వస్తాయని నేషనల్ హైవే అధికారులు చెబుతున్నా అవి ఎంతవరకు సఫలీకృతం అవుతాయోనన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు రావాల్సి ఉంది

కర్నూలు నుంచి ఆత్మకూరు వరకు నేషనల్ హైవే రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి అనుమతులు రావాల్సి ఉంది. ఈ రోడ్డులో కొన్ని ప్రాంతాల్లో వర్షం వల్ల కొంత మేర రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఈ రహదారి నేషనల్ హైవే జాబితాలో మాత్రమే ఉంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాబితాలో చేరాల్సి ఉంది. మరమ్మతులకు గురైన రోడ్లకు మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– వైద్యనాథ్, ఏఈ, నేషనల్ హైవే

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పెంచికలపాడు సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై ఆదివారం జరిగింది. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం శ్రీరంగాపురంకు చెందిన హుస్సేన్‌బాషా కంభం వైపునకు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. పెంచికలపాడు సమీపంలోకి రాగానే గేదెలు అడ్డురావడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గిద్దలూరు 108 సిబ్బంది క్షతగాత్రుడిని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం ఎన్నిక

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షుడిగా గొట్టం మల్లికార్జునరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో ప్రైవేటు పాఠశాలల సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా కె.రంగయ్య, ఉపాధ్యక్షుడిగా పి.నారాయణ, కార్యదర్శిగా పి.ప్రకాష రావు, కోశాధికారిగా పీవీ శ్రీనివాసరావు, న్యాయ సలహాదారునిగా పి.పవన్‌కుమార్, నాగార్జునరెడ్డి, ఈసీ మెంబర్లుగా సురేష్‌బాబు, శివశంకర్‌రెడ్డి, కరీముల్లా, మహేష్‌ను ఎన్నుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

హిందూ సంఘటితానికి వీహెచ్‌పీ కృషి

- వీహెచ్‌పీ అఖిల భారత కార్యదర్శి వై రాఘవులు

త్రిపురాంతకం: భారతీయ సంస్కృతి, హిందూ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా హిందువులందరినీ సంఘటితం చేస్తున్నది విశ్వహిందూ పరిషత్ అని వీహెచ్‌పీ అఖిల భారత సంఘటనా కార్యదర్శి వై రాఘవులు పేర్కొన్నారు.

త్రిపురాంతకం ఆలయాల సమీపంలో విశ్వహిందూ పరిషత్ ప్రారంభమై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా యర్రగొండపాలెం ఏరియా ధర్మ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ప్రారంభమైన తర్వాత దేశంలో అనేక మార్పులను చూసిందన్నారు. హిందూ సమాజం వారి సంస్కృతి సాంప్రదాయాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. దేవాలయాల ద్వారానే హిందూ సమాజ అవసరాలన్నీ తీరేవని తెలిపారు. నేడు గ్రామాల్లో అనేక దేవాలయాల్లో దీపధూప నైవేద్యాలకు నోచుకోవడం లేదన్నారు. అలాంటి దేవాలయాల్లో దీపారాధన, భజన కార్యక్రమాలు జరిగేలా కృషి చేయాలన్నారు. హిందువులంతా సంఘటితంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని ఐక్యంగా ముందుకు సాగాలని రాఘవులు పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు విరారావు, కార్యదర్శి గురుస్వామి జిల్లా ధర్మప్రసార్ కార్యదర్శి గురువరెడ్డి, త్రిపురాంతకం పుల్లలచెరువు, యర్రగొండపాలెం ధర్మ ప్రసార్ ప్రముఖ్‌లు కెవి రమణారెడ్డి, నాగిరెడ్డి, వీరప నాయుడు మూడు మండలాలకు 350 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



త్రిపురాంతకం హిందూ ధర్మ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న విశ్వహిందూపరిషత్ అఖిల భారత సంఘటన కార్యదర్శి వై రాఘవులు

ఘనంగా బీపీ మండల్ జయంతి

యర్రగొండపాలెం: బీసీ రిజర్వేషన్ల పితామహుడు, బెంగాల్ మాజీ సీఎం బీపీ మండల్ యాదవ్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బీసీ కాలనీలో జాతీయ బీసీ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు పోసాని శ్రీరాములు అధ్యక్షతన మండల్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జక్కి నాగసుబ్బారావు, వెంకట ఆదినారాయణ, పాలూరి శ్రీను, జక్కి నాగరాజు పాల్గొన్నారు.



మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న గుంటి గంగా భవాని అమ్మవారు



అలంకరణలో పల్లె పోలేరమ్మ తల్లి

తాళ్లూరు(దర్శి): ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారికి అష్టోత్తర శత నామావలి పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పొంగించి నివేదన చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ తల్లికి మొక్కులు

దొనకొండ: మండలంలోని దేశిరెడ్డిపల్లి, ఇండ్లచెరువు గ్రామాల్లోని ప్రజలు పోలేరమ్మ తల్లికి ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. ఏటా శ్రావణ మాసంలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. మా ఊరును చల్లగా చూడమ్మా, పాడి పంటలు సమృద్ధిగా పండాలి, పిల్లా పాపలు సంతోషంగా ఉండాలి, సంవృద్ధిగా వర్షాలు పడాలంటూ మొక్కుకుంటారు. స్త్రీలు తలంటి స్నానాలు చేసి అమ్మవారికి నైవేద్యాలు చేసి సమర్పించారు. యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు.

ముందు జాగ్రత్తే మందు

- మూగ జీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు
- వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యుల సూచన

పుల్లలచెరువు: వర్షాకాలంలో మూగ జీవాలకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల తీసుకునే ముందు జాగ్రత్తలే నివారణ మందు అని పశువైద్యాధికారులు చెబుతున్నారు. సకాలంలో ముందు జాగ్రత్తలు పాటించి, సమీపంలోని పశువైద్యశాలలో చికిత్స అందిస్తే జీవాలు భద్రంగా ఉంటాయని పుల్లలచెరువు పశువైద్యాధికారి నాగూర్‌మీరా తెలిపారు. ఆయన గొర్రెలు, మేకలకు సోకే సీజనల్ వ్యాధులు, పాటించాల్సిన ముందు జాగ్రత్తలపై వివరించారు.

పీపీఆర్ వ్యాధి:

వైరస్ వల్ల ఈ వ్యాధి గొర్రెలు, మేకలకు సోకుతుంది. వ్యాధి సోకిన గొర్రెల్లో 106 డిగ్రీల జ్వరం వస్తుంది. ముక్కు నుంచి నీరు కారడంతో పాటు నోటి పుండ్లు కూడా వస్తాయి. దుర్గంధపు విరేచనాలు అవుతాయి. వ్యాధి సోకితే ఆహారం తీసుకోలేక మృతి చెందుతాయి. నివారణకు పీపీఆర్ టీకాలు ముందుస్తుగా వేయించాలి.

చిటుకు వ్యాధి:

దీనిని పారుడు రోగం (ఎంటీరోటాక్సీమియా) అంటారు. ఈ వ్యాధి క్లాస్ట్రీడిఎం అనే సూక్ష్మ క్రిమి ద్వారా సోకుతుంది. తొలకరి చినుకులు పడిన తరువాత వచ్చిన పచ్చికను గొర్రెలు, మేకలు మేసినప్పుడు పచ్చికతో పాటు ఈ వ్యాధిని కలుగచేసే సూక్ష్మ క్రిములు వాటి కడుపులోకి ప్రవేశించి కొన్ని విష పదార్థాలను విసర్జించడం వలన ఈ వ్యాధి సోకుతుంది. దీని నివారణకు ఈ సీజన్‌లో చిటుకరోగ నిరోధక టీకాలు వేయించుకోవాలి. ఈ టీకాలు వేసే సమయానికి నెల రోజుల ముందుగా విధిగా గొర్రెలన్నింటికీ నట్టల, బద్దె పురుగు నివారణ మందు తాగించాలి.

ముందస్తు జాగ్రత్తలు

వర్షాకాలంలో గొర్రెలు, మేకలను పాకల్లోనే ఉంచాలి. బురద, చిత్తడి నేలల్లో ఉంచకూడదు. రెండు ఇంచీల మేర గడ్డి పెరిగిన చోట మాత్రమే మేతకు వదలాలి. పరిశుభ్రమైన నీరు తాగించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. మూగ జీవాల పేడను పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి. ఎటువంటి వ్యాధి లక్షణాలు ఉన్నా వెంటనే సంబంధిత పశు వైద్యాధికారిని సంప్రదించి నివారణ చర్యలు తీసుకోవాలి.

టీకాలు వేయించాలి



వర్షాలు కురిసినప్పుడు ఎక్కువగా పచ్చి గడ్డి మేపవద్దు. వ్యాధి నిరోధక టీకాలు ముందుగా వేయించాలి. మూడు వారాలకు ముందు, లేదా గర్భంతో ఉన్నప్పుడు టీకాలు వేయిస్తే పుట్టిన జీవాలకు 8 నెలల వరకు వ్యాధి సోకదు. ముందస్తుగా ఏప్రిల్, మే నెలల్లో టీకాలు వేయిస్తే మంచిది.

– నాగూర్‌మీరా, పశువైద్యాధికారి



కంకి దశలో ఉన్న సజ్జ

పంట కోసం పాట్లు!



పంట పొలాల్లో కోతుల గుంపు, కాకులను బెదిరిస్తూ చప్పుడు చేస్తున్న రైతు

కొనకనమిట్ల: ఆరుగాలం శ్రమించి, కష్టపడి పండించిన పంటను కాపడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్న పందులు, కోతులను బెదరగొట్టేందుకు రైతులు చేయని ప్రయత్నమంటూ లేదు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పంట చేల వద్ద కాపలా ఉంటూ, రాత్రిళ్లు మంచెల వద్ద జాగారం ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్సై మురళి

దర్శి: తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఎమ్ మురళీ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ముగ్గురు యువకులు సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఆ ముగ్గురిని కోల్పోయి తల్లిదండ్రులు ఎంతో బాధ అనుభవిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తగు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. వర్షాకాలం కావడంతో నీటి కుంటలు, సాగర్ కాలువల వైపు పిల్లలను వెళ్లనీయవద్దని హితవు పలికారు. అలాగే ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే కఠిన చర్యలు

దర్శి: సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వై రామారావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలు చేస్తూ అసభ్యకరమైన పోస్టులు పెడుతూ విద్వేషాలు రెచ్చగొట్టి ఉద్రిక్తలు సృష్టిస్తున్నారని చెప్పారు. వీరిపై ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం, షేర్ చేయడం నిషిద్ధమన్నారు. గ్రూప్ అడ్మిన్లు ఈ విషయంలో అలర్ట్‌గా ఉండాలని చెప్పారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందన్నారు.